క్లుప్తంగా

సిరులతల్లికి తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సేవ్ వాటర్.. సేవ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి నీటి ప్రాముఖ్యత వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు ఎస్. అనురాధ, డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ జె. లావణ్య, డాక్టర్ బి. హైమావతి నీటి వృధాను అరికట్టాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్



పిల్లలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైరెక్టర్ షీలా జాక్సన్ తదితరులు

డాబాగార్డెన్స్: మహారాణిపేట జిల్లా పరిషత్ సమీపాన గల ఆల్వెట్ స్కూల్ కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ (ప్రీ స్కూల్ ఫంక్షన్) శనివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని యూకేజీ పూర్తి చేసిన చిన్నారులకు స్కూల్ డైరెక్టర్ షీలా జాక్సన్, మాజీ వైస్ ప్రిన్సిపాల్, శివ శివానీ స్కూల్ ప్రిన్సిపాల్ సుభద్ర కిషోర్, జాతీయ అథ్లెట్ నళిని రాజారత్నం చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ స్కూల్లో చదివిన విద్యార్థులెందరో ఉన్నత విద్యనభ్యసించి, మంచి స్థాయిలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నితీష్, ఉపాధ్యాయులు కుమారి, పావనీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ట్రైనింగ్ క్యాంపునకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న విశాఖ రెడ్‌క్రాస్ కార్యదర్శి రవికుమార్

మహారాణిపేట: ఈ నెల 24 నుంచి 28 వరకు ఒడిశా రాష్ట్ర స్థాయి స్టడీ జూనియర్ రెడ్ క్రాస్ ట్రైనింగ్ క్యాంపునకు విశాఖ జిల్లా శ్రీ శారదా విద్యా నిలయం స్కూల్ జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో ఐదుగురు విద్యార్థులను విశాఖ రెడ్ క్రాస్ శాఖ పంపనుంది. శనివారం విద్యాలయం ప్రిన్సిపాల్ పి.డి.ఎల్.ఎస్. శ్రీనివాసరావు, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ పి.రవికుమార్, జేఆర్‌సీ, వైఆర్‌సీ కోఆర్డినేటర్ ఎండీ రెహ్మతుల్లా, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సంతోష్ రెడ్‌క్రాస్ జెండా ఊపి విద్యార్థులకు వీడ్కోలు పలికారు.

తపోదీక్ష.. సర్వ జగద్రక్ష



జీసెస్ విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దీక్షాధారులు



దీక్షాధారులకు మాలలు వేస్తున్న ఫాదర్ వినయ్‌కుమార్

సన్మార్గం చూపే దీక్షాధారణ

46 రోజులు నిష్టతో పాటిస్తున్న క్రైస్తవులు

22 ఏళ్లుగా కొనసాగుతున్న పుణ్యకార్యం

కంచరపాలెం: మానసిక ప్రశాంతత, పాపపరిహారార్థం క్రైస్తవులు తపోదీక్షలను భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నారు. 46 రోజుల పాటు సాగే ఈ దీక్ష విభూది వేడుకలతో ప్రారంభమై ఏప్రిల్ 18న గుడ్‌ఫ్రైడేతో ముగుస్తుంది. ఏసు సువార్త పరిచర్య ప్రారంభించడానికి ముందు 40 రోజులు జెరూసలేంలోని ఎడారి ప్రాంతంలో ఉపవాస దీక్షలు చేపట్టారు. అనంతరం దీనులను ఆదుకున్నారు. ఏసు చేసిన ఉపవాస దీక్షలను తపస్కాల తపోదీక్షలుగా పిలుస్తారని జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్రం, సెయింట్ పీటర్స్ పునీత పేతురు రాయప్ప ప్రధాన దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు.

రక్షణగిరిలో తపోదీక్షలు..

ఆది కాలంలో అనేక మంది రాజులు, ప్రవక్తలు, ప్రజలు పాప పరిహారంగా శరీరమంతా బూడిద పూసుకుని గోనెబట్ట ధరించి ఉపవాసంతో 40 రోజులు తపస్సు చేసినట్లుగా పవిత్ర బైబిల్ ధ్రువీకరిస్తోంది. 2003లో రక్షణగిరి తపోదీక్షలు ప్రారంభించి సంఘపరంగా నిర్దిష్ట నియమాలు ప్రవేశపెట్టారు. పూర్వం ఎవరికి వారే ఈ దీక్షలు పాటించేవారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది సంఘటితంగా దీక్షలు స్వీకరిస్తున్నారు.

నిష్టలో దీక్షాధారులు..

తపోదీక్షలో స్త్రీ, పురుషులు జపమాలలు ధరించారు. దీక్షాధారణ సమయంలో నిత్యం దివ్యపూజల్లో పాల్గొంటున్నారు. సూర్యోదయానికి ముందే నిద్ర లేచి స్నానం చేసి తెలుపు, నీలి వస్త్రాలు ధరించి మద్యం, మాంసాహారం విడిచి సన్మార్గంలో పయనించేందుకు నిష్టతో దీక్షలు పూనారు.

పెరుగుతున్న విశ్వాసులు..

2003లో భక్తిశ్రద్ధలతో 150 మంది తపోదీక్షలను ప్రారంభించారు. విశాఖ రక్షణగిరి జ్ఞానాపురం పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్తల ఆధ్వర్యంలో పునీత పేతురు దేవాలయంలో దీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా దీక్షాధారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది పలు చర్చిల్లో సుమారు 5 వేల మందికి పైగా దేవుని సేవలో ఉన్నారని ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు.



సెయింట్ పీటర్ చర్చిలో మాట్లాడుతున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్

తపోకాలంలో పాటించాల్సిన దీక్షా నియమాలు..

- సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానం చేసి తెలుపు, నీలి వస్త్రాలు .
- దరించి శిలువ మార్గం, దివ్య బలిపూజ తపోదీక్ష ప్రార్థన చేయాలి.
- ప్రతిరోజు తప్పనిసరిగా దివ్యపూజలో పాల్గొనాలి.
- తపోదీక్షలో జపమాల ధరించి ఉపవాసం చేయాలి.
- కొంత మొత్తాన్ని పేదలకు దానం ఇవ్వాలి.
- జూదం, ధూమపానం, మద్యపానం, మాంసాహారాన్ని వదిలివేయాలి.
- ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని ప్రార్థనలు చేయాలి.
- ఘర్షణలకు దూరంగా ఉండి, మిత్రభావాన్ని పెంపొందించుకోవాలి.
- చెడు వ్యసనాలకు బానిసలుగా మారే యువత సన్మార్గంలో పయనించేందుకు ఈ తపో దీక్ష ఉపవాసాలు ఉపయోగపడతాయని దీక్షాపరులు చెబుతున్నారు.

సేవ చేసే భాగ్యం కలుగుతుంది



46 రోజుల ఉపవాస దీక్షలో పేద, గొప్ప అనే తారతమ్యం లేకుండా అందరికీ సేవ చేసే భాగ్యం కలుగుతుంది. అలా ఇతరులకు సేవ చేయడం, వారిని ప్రేమించడం అలవడుతుంది.
– బోధల రాజు, దీక్షాపరుడు, జ్ఞానాపురం

జ్ఞానవరాలు పొందుతారు..



తపోదీక్ష స్వీకరించిన వారు అనేక జ్ఞానవరాలు పొందుతారు. తపోదీక్షల తర్వాత సమాజంలో నైతిక బాధ్యతలు అలవర్చుకుంటున్నారు. భక్తిశ్రద్ధలతో తపోదీక్షలను ఆచరించడం వల్ల దయామయులుగా మారుతున్నారు.
– సానబాని అనిత, దీక్షాపరురాలు, జ్ఞానాపురం

శాంతి లభిస్తుంది..



దీక్షాకాలంలో మానసిక ఒత్తిడి నుంచి బయట పడుతున్నారు. దీక్షను స్వీకరించటం వల్ల పూర్తిగా ప్రార్థన కోసం కాలం వెచ్చించడంతో మానసిక శాంతి కలుగుతుంది.
– అర్జున్, దీక్షాపరుడు, కంచరపాలెం.

సన్మార్గానికి దిక్సూచి..



తపోదీక్ష స్వీకరించిన వారు అనేక జ్ఞానవరాలు పొందుతారు. మద్యానికి బానిసలైనవారు, కుటుంబ అనైక్యతతో బాధపడుతున్న వారు ఈ దీక్షల వల్ల శాంతి పొందుతారు. దయామయులుగా మారుతారు.
– రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, జ్ఞానాపురం

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు



కారుణ్య నియామకాలు పొందిన వారితో కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ తదితరులు

డాబాగార్డెన్స్: ఏపీఎస్ఆర్‌టీసీలో పని చేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు వివిధ శాఖల్లో కారుణ్య నియామకాల ద్వారా శనివారం అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేశారు. కొద్ది రోజులుగా ఈ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, సంస్థ యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన విజ్ఞాపన పత్రాల పరిశీలన అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ హరేందిరప్రసాద్ నేతృత్వంలో ఆర్డర్లు అందజేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు ఈ సందర్భంగా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె. ఈశ్వరరావు, ఏపీఎస్ఆర్‌టీసీ పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కలిగి ఉన్న ఆరుగురి అరెస్ట్



పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

అల్లిపురం: లాడ్జీల తనిఖీల్లో భాగంగా టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు సమక్షంలో శ్రీ లక్ష్మి లాడ్జిలో తనిఖీలు చేస్తుండగా ఒక గదిలో ఆరుగురు వ్యక్తులను అనుమానితులుగా గుర్తించారు. వారి గదిలో తనిఖీ చేయగా 31 కేజీల గంజాయి లభించింది. నిందితులు ఆరుగురు మహారాష్ట్ర, నాసిక్‌కు చెందిన గణేష్ రాజారామ్ పాగర్, షామీమ్ హబీబ్ షేక్, మదుఖర్ కారే, అజయ్ శ్యామ్ షిండే, మంగేష్ షోపన్ సత్‌పతి, రూపేష్ బాలు గైక్వాడ్‌లుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

24,25 తేదీల్లో తాగునీటికి అంతరాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-8 పరిధిలో వివిధ ప్రాంతాలకు వెళ్లే తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఈ నెల 24, 25 తేదీల్లో ఆయా జోన్ల పరిధి పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయపూర్ నుంచి సబ్బవరం జాతీయ రహదారిపై నిర్మాణ పనులు జరుగుతున్న సందర్భంగా జీవీఎంసీ ప్రధాన వనరులైన తాటిపూడి మంచినీటి సరఫరా పథకం 900 ఎంఎం వ్యాసం గల బీడబ్ల్యూఎస్‌సీ ప్రధాన పైపులైను ఉత్తరాపల్లి, ముసిడిపల్లి, పాత పెందుర్తి తదితర ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా ఆ రెండు రోజులు మంచినీటి సరఫరా పూర్తిగా నిలిపివేయనున్నట్లు తెలిపారు. జోన్-8 పరిధిలో గల 93వ వార్డు (పార్ట్) నుంచి 98వ వార్డులో గల సాయి దుర్గానగర్, దుర్గానగర్, కృష్ణానగర్, అప్పలనరసింహం కాలనీ, వెంకట సాయినగర్, బంట కాలనీ, రవినగర్, లక్ష్మీపురం, పోర్ట్ కాలనీ, రామకో ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకుల్దాం కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్ఐసీ కాలనీ, సుజాతా నగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, జెడ్పీ హెచ్ఎస్ ఏరియా, ప్రశాంతినగర్, క్రాంతినగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపూరి లేఅవుట్, అడవివరం, ఎస్సీ కాలనీ, పాత అడవివరం, అడవివరం తదితర ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడతుందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయనున్నట్టు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ ప్రచారం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం: దేశ స్వాతంత్ర్యం కోసం ఉరి కంబాన్ని ముద్దాడిన యువకిశోరం సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి స్ఫూర్తితో, ఈ నెల 23వ తేదీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వరకు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ప్రచారం నిర్వహించాలని నిర్ణయించినట్లు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడవసారి మోదీ అధికారం చేపట్టిన తర్వాత ముస్లింలు, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. రైతులకు నష్టం కలిగించి కార్పొరేట్లకు ఉపయోగపడే మూడు నల్ల చట్టాలు రద్దు చేయాలని నాలుగు సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్న రైతుల నిరసన శిబిరాలను ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, ఎ. విమల, జీఎస్‌జే అత్యుతరావు, కె. సత్యనారాయణ, కె. సత్యాంజనేయ, ఎస్.కె.రెహమాన్, ఎం.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

వేద విద్య ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శేషాద్రి

డాబాగార్డెన్స్: పల్నాడు జిల్లా మాదిపాడులోని వేద వేదాంత గురుకుల మహా విద్యాలయంలో వేద విద్య ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రొఫెసర్ శేషాద్రి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఇది ఓ సువర్ణావకాశమని చెప్పారు. వేద విద్యనభ్యసించదలచిన వారు 9963057025 నంబరుకు వాట్సాప్ సందేశం పంపాలని తెలిపారు. విద్యార్థులకు ధార్మిక విలువలతో కూడిన ఆధునిక విద్య అందించడంతో పాటు, ప్రపంచ స్థాయిలో అవకాశాలు అందించేందుకు అవసరమైన మెలకువలు నేర్పనున్నట్టు చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు హరిత వనం ఇదే సందర్భంలో మహా విద్యాలయ ప్రాంగణంలో ఔషధ వృక్షాలు నాటనున్నట్టు ప్రకటించారు. వేద విద్యార్థులకు తగిన ఆర్థిక సహకారం, ఉపకార వేతనాలు అందజేయనున్నట్టు చెప్పారు.

ఆదిత్య కళాశాలలో డిజిటల్ మూల్యాంకనం

డాబాగార్డెన్స్: డిజిటల్ మూల్యాంకనాన్ని ఆదిత్య డిగ్రీ కళాశాల అన్ని బ్రాంచిల్లో ప్రవేశ పెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. కుమార్ తెలిపారు. ఇప్పటి నుంచి ఎంబీడీ ఎగ్జామ్ పేపర్లు కూడా ఒక బ్రాంచ్ పేపర్లను మరో బ్రాంచ్‌కి పంపి మూల్యాంకన చేయనున్నట్లు తెలిపారు. డిజిటల్ మూల్యాంకన సాఫ్ట్‌వేర్‌ను ఆదిత్య విద్యార్థులు రూపొందించినట్టు చెప్పారు. ఈ మేరకు డిజిటల్ మూల్యాంకనాన్ని ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ చేతుల మీదుగా ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి శనివారం ఆవిష్కరింపజేశారు.

సెమీస్‌కు మూట్ కోర్టు పోటీలు

విశాఖ విద్య: న్యాయ విద్యార్థుల్లో నైపుణ్యాలను, సామర్థ్యాలను పెంపొందించే విధంగా జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు జరుగుతున్నాయి. ఏయూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు రెండో రోజు శనివారం ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 24 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరగనున్న సెమీ ఫైనల్స్‌కు నాలుగు జట్లు చేరుకున్నాయి. శనివారం నిర్వహించిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత న్యాయమూర్తులు డాక్టర్ బి.సత్యనారాయణ, డి.ధర్మారావు, విశాఖ న్యాయవాదుల సంఘం పూర్వ అధ్యక్షులు కె.ఏ ప్రకాష్, బి.వి.ఆర్.మూర్తి వ్యవహరించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, న్యాయ కళాశాల పూర్వాచార్యులు ఆచార్య వి.కేశవరావు ఆచార్య ఎస్.సుమిత్ర, ఆచార్య వి.రాజ్యలక్ష్మి, ఆచార్య చంద్రకళ, మూట్ కోర్టు పోటీల సమన్వయ కర్త డాక్టర్ ఎల్.వి.కె ప్రసాద్, డాక్టర్ పల్లవి పాల్గొన్నారు.


పగటి పూట వెలుగులతో విద్యుత్ వృథా



స్లీప్‌గుర్తు వీధిలో మిట్ట మధ్యాహ్నం వెలుగుతున్న హైమాస్ట్ రింగ్ లైట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో పగటి పూటే వెలుగులు విరజిమ్ముతున్నాయి. మాన్యువల్ స్ట్రీట్, స్లీప్‌గుర్తు వీధి, డయాస్ వీధి, రాచ వీధి, ఎర్రిగెడ్డ వీధుల్లో మధ్యాహ్నం పూట కూడా వీధి లైట్లు, హైమాస్ట్ లైట్లు వెలుగు తుండడంతో స్థానికులు అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పు పడుతున్నారు. రాత్రి వేళల్లో వెలగని విద్యుత్ లైట్లు పగటి వేళ వెలగడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాత్రిపూట చీకట్లు కమ్ముకుని దొంగల భయం ఉంటుందని చెబుతున్నారు. వారం రోజులుగా స్లీప్‌గుర్తు వీధిలో హైమాస్ట్ రింగ్ లైట్లు వెలుగు తుండడంపై వీధి విద్యుత్ లైట్ల విభాగ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఉమామహేశ్వరరావుకు అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డు



మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృత అధ్యాపకుడు, జాతీయ సేవా పథకం అధికారిగా పని చేస్తున్న డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. కలకత్తాలోని వెల్ రెడ్ ఫౌండేషన్ సంస్థ వివిధ విభాగాల్లో ప్రకటించిన అవార్డుల్లో.. ఉమామహేశ్వరరావుకు సోషల్ సర్వీస్ విభాగంలో అవార్డు దక్కింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి బెస్ట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు శనివారం కళాశాలలో ఉమామహేశ్వరరావును అభినందించారు.

వైభవంగా సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ సాంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదు

- కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు



శ్రీధర్‌ను పరామర్శిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: ఊపిరి ఉన్నంత వరకూ వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ స్పష్టం చేశారు. ఎల్లో మీడియాలో వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పారు. 'మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సహకారంతో 41వ వార్డును అభివృద్ధి చేయగలిగాం. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా పూర్తి చేయడానికి మా వంతు కృషి చేస్తాం' అని వారు తెలిపారు. నియోజకవర్గంలో మళ్లీ అఖండ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని వారు విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ రావాలని ఆకాంక్షించారు. వడదెబ్బకు గురైన కోడిగుడ్ల శ్రీధర్, పూర్ణిమను శనివారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్, నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధత కలిగిన కోడిగుడ్ల శ్రీధర్ వైఎస్సార్‌సీపీని వీడుతారని ఎల్లో మీడియాతో తప్పుడు వార్తలు రాయించుకునే కుటిల రాజకీయాలను మానుకోవాలని ఆయన అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నేడు తమతో ఉన్న వారంతా వైఎస్సార్ సీపీని నరనరాల్లో నింపుకున్నారని, వారితోనే మళ్లీ విజయం సాధిస్తామని ఆయన స్పష్టం చేశారు. కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ 41వ వార్డులో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహకారంతో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేశారని ఆయన గుర్తు చేశారు. నిజాయితీగా పనిచేసే వారిని డబ్బుతో కొనలేరని, తప్పుడు వార్తలతో వైఎస్సార్‌సీపీ నీడను కూడా లొంగదీయలేరని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డి రామానంద్, వడ్డాది దిలీప్, గురజాపు రవి, పీతల వాసు, అలపన కనకరెడ్డి, ముజీబ్‌ఖాన్, కడియం ప్రసాద్, బెవర మహేష్, తాడి రవితేజ, ఆరుగుల కృష్ణకుమార్‌రెడ్డి, రామరాజు, చింతకాయ వాసు, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.

గంగుల గెడ్డలో సీపీఎం ప్రజా చైతన్యయాత్ర

డాబాగార్డెన్స్: సీపీఎం జగదాంబ జోన్ కన్వీనర్ వై. రాజు అధ్యక్షతన శనివారం గంగుల గెడ్డలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బొడ్డు గంగారావు పాల్గొని గంగుల గెడ్డ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో 32 గృహాలున్నాయని, అందరూ రజకులేనని తెలుసుకున్నారు. 20 గజాలు కూడా లేని స్కీం ఇళ్లకు రూ.3 వేలు ఇంటి పన్ను వస్తుందని, విద్యుత్, వాటర్ బిల్లు విపరీతంగా వస్తుందని గంగారావు దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఇటీవల ఎండోమెంట్ విభాగం నుంచి ఖాళీ చేయమని నోటీసులు వచ్చాయని, రజకులకు సంబంధించి చాకిరేవు చాలా అధ్వాన స్థితిలో ఉందని, మోటారు వేసినప్పటికీ కరెంటు బిల్లు రజకులే కట్టుకోవాలని, విద్యుత్ లైట్లు లేవని, పర్మినెంట్ శ్లాబ్ హౌస్ లేదని, ఇంటి స్థలాల కోసం డబ్బులు చెల్లించినప్పటికీ ఎవరికీ స్థలాలు రాలేదని తెలిపారు. ఈ విషయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్తే అతీగతీ లేదని వాపోయారు. కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ ఇటువంటి స్కీం ఇళ్లకు ఏడాదికి రూ.50 కన్నా ఎక్కువ ఇంటి పన్ను రాకూడదని, అలాగే చాకిరేవు ఆధునికీకరించాల్సి ఉందని, రజకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కె. నర్సింగరావు, చంద్రమౌళి, బొట్ట రామకృష్ణ పాల్గొన్నారు.